
బస్సు గుమ్మంలో వేలాడుతూ నిలబడిన సుమిత్రకు ఏడుపొస్తోంది. బలవంతాన బాధను పంటి బిగువున భరించటానికి విశ్వప్రయత్నం చేస్తోంది.


ఆమె శరీరాన్ని రాసుకుంటూ నిలబడ్డ మొగవాళ్లందర్నీ మనసులోనే తిట్టుకోసాగింది. ఉదయం ఎనిమిది కాకుండానే ఎండ దబా యిస్తోంది. బీడీ పొగ వాసనకు ఆమెకు కడుపులో తిప్పుతున్నట్లు ఉంది. బస్సు వెనుతిరిగి కదులుతుంటే యథాలాపంగా బెంచీల వైపు చూసింది. బస్ స్టాండులోని బెంచీల పైన కూర్చున్నవాళ్లలో ఆడవాళ్లు చాలా తక్కువ మంది ఉన్నారు. మగవాళ్లు, కాలేజీ కుర్రాళ్లు చాలా మంది బెంచీల పైన కూర్చుని కనిపించారు.

బస్ స్టాండు వదిలి, నగరాన్ని వదిలి బస్సు బేలుపల్లి వైపు కదిలింది. బస్సు కదులుతుంటే, కదలకుండా నించోవటం సుమిత్ర వల్ల కాలేక తూలిపడబోయి తమాయించుకుని నిల్చుంది. ఎక్కడ బస్సు వెళ్లిపోతుందో అనే తొందరలో ఇంటి వద్ద నుండి పరుగు పరుగున వచ్చేసింది. దాంతో ఆయాసంగా అనిపిస్తోంది. దానికి నీరసం తోడయ్యింది.

# అంతర్దర్శనం

పలమనేరు బాలాజి








రాత్రి భోజనం చెయ్యాలనిపించలేదు. ఉదయం టిఫిన్ తినటానికి సమయం చాలలేదు. స్కూలుకు వెళ్లాక అక్కడే టిఫిన్ తిందామని లంచ్ బాక్స్‌తో బాటూ టిఫిన్ బాక్స్ కూడా సర్దిపెట్టుకుంది. కానీ వచ్చే హడావుడిలో టిఫిన్ బాక్స్ తేవటం మరచిపోయింది. టైం చూసుకుంది.

ఇవ్వాళైనా సరిగ్గా స్కూలు సమయానికి, ఆలస్యం లేకుండా వెళ్లాలని అనుకుంది. కానీ బస్సు నడుస్తున్న వేగాన్ని చూస్తుంటే అది అసలు జరిగేటట్లు అనిపించలేదు.

హెడ్ మాస్టర్ మొహం గుర్తొచ్చేసరికి సుమిత్రకు విసుగు ఎక్కువై పోయింది.

ఇప్పటికే తను చాలా సార్లు అనుకుంది. మరెప్పుడూ స్కూలుకు ఆలస్యంగా పోకూడదని. అయినా వారంలో నాలుగైదు రోజులు సమయానికి రావటం కుదరనే కుదరదు. అరగంట ముందుగా బస్ స్టాండుకు రాగలిగితే, ఇంత కంటే ముందున్న బస్సును అందుకోవచ్చు బయలుదేరే బస్సు ఎక్కవచ్చు. అప్పుడైతే సమయం సరిపోయేది.



ఐనా ఎంత ప్రయత్నించినా. ఇంత కంటే కనీసం పది నిముషాల ముందైనా బస్ స్టాండుకు రాలేక పోతోంది. రాత్రులు పడుకోవటం బాగా ఆలస్యమవుతోంది. ఉదయం ఐదున్నరకే లేచినా సరే, పనులన్నీ పూర్తి చేసుకుని ఇంట్లోంచి బయట పడేసరికి ఆలస్యం అవుతోంది.

సురేశ్‌కి ఎన్ని సార్లు చెప్పినా తన టెన్షన్ అర్థం కావటం లేదు. ఎప్పుడైనా కాస్సేపు అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తేనే కదా తెలిసేది తానేమిటో తన బాధేమిటో. అతడి పనులు అతడు చేసుకున్నా తన కెంతో సమయం ఆదా అయ్యేది.

పెళ్లయ్యి పిల్లలు పుట్టి ఏళ్లు గడిచాక వెనక్కి తిరిగి చూసుకుంటే తను తనేనా అనే అనుమానం కలుగుతుంది.

సురేశ్ పని చేసే స్కూలు ఊరికి చాలా దగ్గర. అతను బైక్ కొన్న రోజు తను పొందిన ఆనందం అంతా ఇంతా కాదు. బైక్ కావాలి. పియఫ్ లోన్ పెట్టు అని చెప్పిన వెంటనే లోన్ అప్లికేషన్ రాసి సంతకాలు చేసి చిత్తూరు జిల్లా పరిషత్ ఆఫీసుకు పంపించేసింది. రెండు సార్లు చిత్తూరుకు వెళ్లి లోన్ మంజూరు చేసుకువచ్చింది. బైక్ కొన్న వారం-పది రోజులో, నెల రోజులో సరదాగానే ఉన్నది. సాయంత్రాలు పిల్లలతో కలిసి బైక్ పైన కూర్చుని ఎటైనా వెళ్లి రావటం, చూసిన సినిమాలు, స్కూలు వరకూ రెండు-మూడు సార్లు వచ్చి బైక్‌లో డ్రాప్ చేసి వెళ్లడం గమ్మత్తుగా అనిపించింది.

అదంతా కొన్ని రోజులే. ఆ తర్వాత మళ్లీ పాత కథే. బండి సురేశ్ ఒక్కడికే పరిమితం అయిపోయింది. దాంతో తనకూ, బండికి మధ్య ఏర్పడిన అనుబంధం ఏదో తెగిపోయినట్లు అనిపించింది.

కొంత కాలం బస్ స్టాండు వరకైనా వచ్చి బండిలో దింపి వెళ్లేవాడు. ఆ తర్వాత రానురానూ అదీ కరవై పోయింది.

ఇంట్లోంచి బయటపడే సరికి బస్సు టైం అయిపోయేది. నింపాదిగా నడవడం మానేసి, పరుగు లాంటి నడకను అలవాటు చేసుకోవటం మొదలైంది అప్పుడే.

ఇంట్లోంచి బస్ స్టాండుకు, బస్ స్టాండు నుండి ఇంటికి పరుగు లాంటి నడక నడిచీ నడిచీ, ఇప్పుడు తను మామూలుగా నడవలేక పోతోంది. తనతో సమానంగా వేగంగా నడవలేక ఎన్ని సార్లు కొలీగ్ నిర్మల తిట్టిపోసింది! అయినా అలవాటైన వేగాన్ని తగ్గించుకోలేక పోతోంది.

నిర్మల భర్తకు కూడా స్కూటర్ ఉంది. ఆమెదీ తన పరిస్థితే. ఇంట్లో మొగు డున్నా, అతనికో స్కూటర్ ఉన్నా అతడికి తీరిక దొరికినా కూడా బస్ స్టాండుకు నడిచి రావల్సిందే.

మొదట్లో గమనించలేదు. కానీ యం.ఆర్.సి ఆఫీసులో మీటింగులు జరిగినప్పుడు, బస్సులో అక్కడక్కడ ఎదురుపడినప్పుడు మిగతా టీచర్స్ కూడా ఇదే విధంగా పరుగు లాంటి నడకలకు అలవాటై పోతున్నామని, మొగుళ్ల తాలూకు స్కూటర్స్ తమకు ఉపయోగపడటం లేదని చెప్పినప్పుడు, సుమిత్రకు కలిగిన ఆశ్చర్యం అంతా ఇంతా కాదు.


చీరతో నడవటం ఒక ఇబ్బందైతే పరుగుపరుగున నడవాల్సి రావటం అదొక ఇబ్బంది. ఎదుటివాళ్ల చూపుల నుంచీ తప్పించు కోవటానికి చీరను, పైటను రోజుకు లెక్క లేనన్ని సార్లు సర్దుకోవాల్సి రావటం, అదొక తల నొప్పి వ్యవహారం అయిపోయింది. పెళ్లి అయిన తరువాత డ్రెస్‌లు వేసుకోవటం బాగా లేదని సురేశ్ తేల్చి చెప్పేసిన రోజు, తను పొందిన బాధ అంతా ఇంతా కాదు. రెండు స్టేజీల తర్వాత బస్సులో జనం తగ్గినాక బస్సు లోపలికి నడిచింది సుమిత్ర.

చివరి సీట్లో కూర్చున్న నిర్మల, పలకరింపు గా నవ్వింది. నిర్మలను చూడగానే అప్పటి వరకూ ఉన్న చికాకు మాయమైపోయి తాను కూడా స్నేహంగా నవ్వింది సుమిత్ర.

“ఏమిటో ఈ వేళ విశేషం? మేడం గారు తొందరగా బస్ స్టాండుకు రావటమే కాక, సీటు కూడా సంపాదించుకున్నట్లున్నారు” అంది సుమిత్ర

“ఇంట్లో మొగుడ్ని అడిగాను. బస్సు టైం అయిపోతూ వుంది. డ్రాప్

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం - ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో రు. 5000/-ల నగదు బహుమతి పొందిన కథ**



చేయండి అని. అయినా ఆ మనిషి కదలడే? తీరిగ్గా పేపర్ చదువుకుంటూ కూర్చున్నాడు. ఈయన గారికి ఇంట్లో ఏం జరుగుతోందో తెలీదు కానీ దేశంలో జరిగే సంగతులన్నీ కావాలి. నేనైనా ఎన్నాళ్లని భరించగలను? చూసి చూసీ విసుగు ఎక్కువై పోయింది. అందుకే అటో ఇటో ఎటైనా సరే అనుకుని ఒక సాహసం చేశానోయ్!" మెల్లగానే మాట్లాడింది నిర్మల.

అయినా ఆమె గొంతులో ఏదో కొత్త ఉత్సాహం దాగి ఉం దనిపించింది. అదేమిటో, ఎందుకో తెలుసుకునే ప్రయత్నం చేస్తూ ఏమైందన్నట్లు కళ్లు ఎగరేసింది సుమిత్ర.

నిర్మల మొహంలో నవ్వు కళ్లల్లో సంతృప్తి కనిపిస్తున్నాయి. "ఇంట్లోంచి హడావిడిగా బయట కొచ్చాను. రోడ్డు మీదికి వచ్చి నిలుచున్నాను. మా ఏరియా గురించి నీకూ తెలుసుగా. సరిగ్గా ఆటోలు దొరకవు. ఆ సమయానికి సిటీ బస్సులూ ఉండవు కదా! టిఫిన్ తినే టైం లేకపోయింది. కప్పు కాఫీ తాగాను. నీరసంగా అనిపించి, నడవలేకపోయాను" అని ఆగింది.

సుమిత్రలో కుతూహలం పెరిగిపోయింది. ఆత్రంగా "అబ్బబ్బ! ఏం జరిగిందో చెప్పు" అని అడిగింది.

నిర్మలకు నవ్వాపుకోవటం చేత కాలేదు. ఆమె అంతగా నవ్వటం ఈ మధ్యకాలంలో అదే మొదటిసారి, సుమిత్ర చూడటం.

నిర్మలంగా నవ్వుతున్న నిర్మలను అలా చూస్తుంటే సుమిత్రకు మరచిపోయిన తన నవ్వు గుర్తొచ్చింది.

కాలేజీ రోజుల్లోని ఆ నవ్వులే వేరు. అందరూ తన నవ్వు బాగుం టుందని అనేవాళ్లు, నవ్వినపుడు బుగ్గ సొట్ట పడేది.

సుమిత్రకు, కస్తూరి గుర్తొచ్చిన ప్రతిసారీ లోలోపల దుఃఖం తన్నుకు వస్తూ ఉంటుంది. ఇద్దరి మధ్య ఎందుకన్ని అడ్డుగోడలు ఏర్పడ్డాయో ఆలోచించే కొద్దీ ఆ గోడల్ని బద్దలు కొట్టాలని బలంగా అనిపిస్తూ వుంటుంది. నిజానికి తను ఫోన్ చెయ్యక పోయినా కస్తూరే చాలా సార్లు ఫోన్ చేసింది, మొదట్లో. ఆమెకు పెండ్లయి, తిరుపతి చేరాక కూడా వాళ్లింటికి కుటుంబ సమేతంగా రమ్మంటూ ఎన్నో సార్లు ఆహ్వానించింది. కొన్ని ఉత్తరాలు కూడా రాసింది.

ఆ సొట్ట చూడ్డం కోసం మిత్రులు చాలా మంది తనను నవ్వించటానికి ఏవేవో జోక్స్ చెప్పేవాళ్లు.

"రోడ్డు మీదికి రాగానే ఇటు వైపు వెళ్లే మొదటి స్కూటర్ అతన్ని ఆపి లిఫ్ట్ అడిగానోయ్. లిఫ్ట్ దొరికింది" అంది నిర్మల.

ఆ మాటతో సుమిత్ర బిత్తర పోయింది.

ఒక్క క్షణం బుర్ర పనిచేయటం మానేసినట్లు అనిపించింది. "మై గాడ్! మీ ఆయనకు తెలిస్తే ఏమవుతుందే?" వాచీ చూసుకుంటూ తల వంచుకున్న నిర్మలను అడిగింది.

"ఏమవుతుంది? గొడవ అవుతుంది. అంతే కదా. ఎప్పుడో ఏదో గొడ వైపోతుందని, మరింకేదో జరిగిపోతుందని మనం భయపడుతూ ఉంటే కాలమంతా ఇట్లాగే గడిచిపోతుంది మిత్రా! మనం ఏదో ఒక సమయంలో నిద్ర వదిలించుకుని లేవాల్సిందే. నిద్ర పోవచ్చు. కానీ నిద్ర నటించకూడదు కదా!" ఏదో ఆలోచిస్తూనే అంది నిర్మల. ఆమె గొంతులో ఏదో స్థిరత్వం.

ఖాళీ అయిన సీటులో కూర్చుంటూ సుమిత్ర నిర్మల వైపు పరీక్షగా చూసింది. ఆమె మొహంలోని భావాలు సరిగ్గా తెలియటం లేదు. ఏదో ఆలోచిస్తున్నట్లుంది. నిర్మల గొంతు వినే ప్రతిసారి సుమిత్రకు కస్తూరి గుర్తొస్తూ ఉంటుంది. ఇద్దరిదీ దాదాపు ఒకే కంఠస్వరం.

"ఏమైనా నువ్వు తొందర పడ్డావు నిర్మలా! అలా చెయ్యకుండా ఉండాల్సింది."

సుమిత్ర మాటలకు బదులు చెప్పే ప్రయత్నం చేయలేదు నిర్మల. ఇద్దరూ ఆలోచనల్లో మునిగిపోయారు.

సుమిత్రకు పెండ్లయ్యేంత వరకూ కస్తూరితో స్నేహం బాగానే నడిచింది. కానీ ఫోన్ బిల్లు చెక్ చేస్తూ ఈ నంబర్ ఎవరిది బిల్లు ఇంత వచ్చింది ఎందుకని మొగుడు నిలదీసినప్పటి నుంచి, ఫోన్‌లో మాట్లాడ్డం మానేసింది, తన వాళ్లతో.

సుమిత్రకు, కస్తూరి గుర్తొచ్చిన ప్రతిసారీ లోలోపల దుఃఖం తన్నుకు వస్తూ ఉంటుంది. ఇద్దరి మధ్య ఎందుకన్ని అడ్డుగోడలు ఏర్పడ్డాయో ఆలోచించే కొద్దీ ఆ గోడల్ని బద్దలు కొట్టాలని బలంగా అనిపిస్తూ వుంటుంది. నిజానికి తను ఫోన్ చెయ్యక పోయినా కస్తూరే చాలా సార్లు ఫోన్ చేసింది, మొదట్లో. ఆమెకు పెండ్లయి, తిరుపతి చేరాక కూడా వాళ్లింటికి కుటుంబసమేతంగా రమ్మంటూ ఎన్నో సార్లు ఆహ్వానించింది. కొన్ని ఉత్తరాలు కూడా

రాసింది.

"ఇప్పుడెలా కుదురుతుంది? తీరిక ఎక్కడుంది? సెలవులు దొరకటం కష్టం కదా. అయినా ఎంత ఖర్చవుతుందో తెలుసా?" రకరకాల సాకులు చెప్పేవాడు సురేశ్. అట్లా మొత్తానికి తనకెంతో ఇష్టమైన స్నేహితురాలి ఇంటికి ఒక్కసారి కూడా వెళ్లలేకపోయింది. క్రమంగా కస్తూరి ఫోనులు కూడా తగ్గిపోయి తర్వాత తర్వాత ఆగిపోయాయి.

ఈ మధ్య ఓ సారి బలంగా అనిపించింది కస్తూరితో తనివితీరా మాట్లాడాలని. తను ఖర్చు పెట్టే ప్రతి రూపాయికి మొగుడికి కచ్చితంగా లెక్కలు చెప్పాలని తెలుసు కాని, ఎస్.టి.డి. సెంటర్‌కు వెళ్లి ఫోన్ చేసి కస్తూరితో ఎన్నో మాట్లాడాలని అనుకుంది. కానీ ఫోన్ నంబర్ ఏదీ? తనకున్న ఒక్కగానొక్క ప్రియస్నేహితురాలి ఫోన్ నంబర్ కూడా తన వద్ద ఎందుకు లేకుండా పోయిందో తెలుసుకోవాలని ప్రయత్నించే కొద్దీ, జీవితం కొత్తగా అర్థ మవసాగింది.

పెండ్లయిన తర్వాత తన తల్లితండ్రులతో, అన్నదమ్ములతో, అక్కచెల్లెల్లతో, బంధువులతో, ఆఖరికి తన స్నేహితులతో అప్పటి వరకూ ఏర్పడిన అనుబంధాలు ఎట్లా అదృశ్యమయ్యాయో ఆలో చిస్తుంటే, సుమిత్రకు తాను కోల్పోయింది ఏమిటో మెల్లగా తెలిసివస్తున్నట్లు అనిపించసాగింది.

బస్సు దిగారు. సుమిత్ర వడివడిగా నడుస్తోంది. వెనుక నిర్మల మెల్లగా.


"మేడం, ఇందాక మన సర్పంచ్ వొచ్చి పోయినాడు. అదే అయివోర్లు ఇద్దరూ దినామ్మా మాట్లాడుకొని లేటుగా వొస్తాండారా ఏంది అయివోరా కత అని మొహం మీదే అడిగేసి పోయినాడు. రోజూ ఇట్లా లేట్ అయితే ఎట్ల మేడం? రేపట్నుంచి తొందరగా వచ్చేయండి. స్కూలు టైం కన్నా ముందే రమ్మనటం లేదు, సరిగ్గా సమయానికి వస్తే చాలు. మధ్యలో అడిగేవాళ్లకు సమాధానం చెప్పలేక పోతున్నాను" హెడ్ మాస్టర్ మొహాన్ని వికారంగా పెట్టాడు.

అతడి గొంతు విసుగ్గా ఉంది. నిష్ఠురంగా ఉంది. హేళనగా ఉంది. కోపంగా ఉంది. వెక్కిరిస్తున్నట్లూ ఉంది.

సుమిత్ర మాట్లాడాలని అనుకున్నా, మరేం మాట్లాడలేక మౌనంగా తరగతి గది వైపు నడిచింది. మధ్యాహ్నం భోజనాలు అయ్యాక స్కూల్లో వంట చేసే లక్ష్మమ్మ, చేతుల్ని చీర కొంగుతో తుడుచు కుంటూ వచ్చి నిలబడి అడిగింది– "అయివోరమ్మా, నేను అడిగిన

**తనకున్న ఒక్కగానొక్క ప్రియ స్నేహితురాలి ఫోన్ నంబర్ కూడా తన వద్ద ఎందుకు లేకుండా పోయిందో తెలుసుకోవాలని ప్రయత్నించే కొద్దీ, జీవితం కొత్తగా అర్థ మవసాగింది.**

**పెండ్లయిన తర్వాత తన తల్లితండ్రులతో, అన్నదమ్ములతో, అక్కచెల్లెల్లతో, బంధువులతో, ఆఖరికి తన స్నేహితులతో అప్పటి వరకూ ఏర్పడిన అనుబంధాలు ఎట్లా అదృశ్యమయ్యాయో ఆలో చిస్తుంటే, సుమిత్రకు తాను కోల్పోయింది ఏమిటో మెల్లగా తెలిసివస్తున్నట్లు అనిపించసాగింది.**



మందు తెచ్చినావామ్మా, ఈ పొద్దయినా."

లక్ష్మమ్మ మొహంలో ఏదో ఆశ, సంశయం, సిగ్గు తొంగి చూస్తున్నాయి.

ఆమె ఊర్లో డ్వాక్రా గ్రూపు లీడరు. మొగుడు తాగుబోతు. తిరుగుబోతు. ఇద్దరు అమ్మాయిలు ఇద్దరు అబ్బాయిలు. ఇద్దరి మధ్యా ఏవేవో గొడవలు.

"అబ్బా ఈ పొద్దు కూడా మరచిపోయినా లక్ష్మమ్మా, నువ్వేం అనుకోకు. రేపో, మర్నాడో ఖాయంగా తెచ్చిస్తాలే" అంది ఇబ్బందిగా మొహం పెట్టి.

మనసూ, శరీరమూ కూడా బావుండటం లేదని, నీరసంగా అనిపిస్తోందని, తాను కూడా డాక్టర్ దగ్గరకు వెళ్లాలని అనుకుంటూనే ఉంది. కానీ ఒక్కతే వెళ్లడం తనకు అలవాటు లేదు. ఎంత అవసరం వచ్చినా సురేశ్ తనను తీసుకు వెళ్లేవరకూ ఆగాల్సిందే. తనకు తానుగా వెళ్లే సాహసం ఎప్పుడూ చేసింది లేదు. జీవితంలో మార్పు రావాల్సిన అవసరం వుందనిపిస్తోంది. కానీ ఆ మార్పు ఎలా మొద లవుతుందో అర్థం కావటం లేదు.ఎప్పుడు అడిగినా "డాక్టర్ దగ్గరి కా? ఎందుకు మిత్రా, మందులు తెచ్చిస్తాలే. డాక్టర్లు అనవసరమైన టెస్టులన్నీ చేపించి ఉండేదీ లేనిదీ చెప్పేస్తారు. అదో డబ్బు దండగ" అంటూంటాడు.

"లావైపోతోంది కదా. ఒంట్లో నీరు ఎక్కువై పోతోందట. ఆయాసం, ఒళ్లు నొప్పులు" లక్ష్మమ్మ సమస్యల్ని ఏకరువు పెట్టింది సుమిత్ర.

"ఏం లావయితే, మీ ఆయన నిన్ను వొదిలేస్తాడని భయమా?" నవ్వుతూనే అంది నిర్మల. అని, "నేనిక ఈ టెన్షన్ భరించలేను మిత్రా. స్కూటర్ కొందామనుకుంటున్నాను. ఏమంటావ్? నేర్చుకో వటానికి ఎవర్నయినా చూడాలి. మా ఆయన నేర్పిస్తాడన్న నమ్మకం నాకు లేదు" అంది.

సుమిత్ర ఉలిక్కిపడింది ఆ మాటతో.

ఎండ మాడ్చేస్తుంది. ఉండుండి వేడిగాలి వీస్తోంది. స్కూలు బయట చెట్ల నీడలో పిల్లలు ఆడుకుంటున్నారు.

"నా తిండి నేను తింటా వుండాను. నా బతుకు నేనే బతకతా ఉండా. పోతే పోనీ. అట్లాంటి మొగుడికి బయపడి బతకాల్సిన ఖర్మ నాకు పట్టలేదు. కాళ్లూ చేతులు ఆడినంత కాలం నాకు బతుకు గురించి భయం లేదు. అయివోరమ్మా!" అంటోంది, లక్ష్మమ్మ చెదిరిన జుట్టు సవరించుకుంటూ.

సుమిత్ర, నిర్మల ఇద్దరూ మొహాలు చూసుకున్నారు. వాళ్ల కళ్లల్లో ఏదో మెరుపు తళుక్కుమంది! ●